మంచి పేరు తెచ్చుకున్న ఆమె ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేసింది?

# వైకుంఠపాళీ

దేవరకొండ గంగాధర రామారావు కథ

ఆ కాలనీకి కొత్తగా వచ్చిన లలితకి అక్కడి వాళ్లతో త్వరలోనే మంచి పరిచయాలైనాయి. ఆ కాలనీలో అందరూ ధనవంతులు. వీళ్ల మధ్యకు రా[illegible]ేనే మొదట లలిత, ఆమె భర్త విశ్వంకూడా వెనుకాడారు. కాని లలితకు అక్కడి కాన్వెంట్‌లో టీచరు ఉద్యోగం రావడంతో అయిష్టంగానైనా ఇక్కడకు రావలసి వచ్చింది. ఇప్పుడున్నది సామాన్య మధ్యతరగతి కుటుంబాల మధ్య ఇక్కడ అందరి జీవితాలు, సమస్యలు సరదాలు ఒకేలా వుంటాయి. పెద్ద వ్యత్యాసాలుండవు మరి హఠాత్తుగా కారులూ, మేడలూ ఉన్న వాళ్ల మధ్యకు వెళ్లాలంటే అయిష్టంగానే వుంటుంది. కాని లలిత కాన్వెంటువాళ్లు ఇచ్చే పదిహేను వందల రూపాయల జీతం వదులుకోలేదు. ఇది తలవని తలంపుగా కలిసొచ్చిన అదృష్టం. ఎందుకంటే భర్తకు ఏదో కంపెనీలో అకౌంటెంట్‌గా ఉద్యోగం. మూడువేలు పైన జీతం అని పేరేగాని, చేతికి అన్ని కోతలు, అప్పులు పోనూ రెండు వేలుకన్నా రాదు. మళ్లీ అందులో ఇంటిదగ్గర తల్లిదండ్రులకి కొంత పంపాలి. చెల్లెలి పెళ్లికి చేసిన అప్పు ఇంకా తీరుతూనే వుంది. తిండికీ, బట్టకి లోటు లేకపోయినా లలిత ఇంకా ఇంటికి ఏమీ సమకూర్చుకోలేకపోయింది. ఈనాడు కనీసావసరాలుగా మారిన ఫ్రిడ్జి, టీవి, గ్రైండరు, స్టీరియో వగైరాలు ఇంకా వీళ్ల ఇంటిని అలంకరించలేదు. అది జీవితంలో ఎంతగానో వెలితిగా వుండి. కాని ఉపశమనం ఏమిటంటే తను ఉన్న మధ్యతరగతివాళ్లకు చాలామందికి అవన్నీ లేవు. టి.వి చూడాలంటే ఎవరో పక్కింటివాళ్లిం



ట్లో చూసిరావచ్చు. అవసరమైతే ఎవరింటికైనా వెళ్లి గ్రైండరు ఉపయోగించుకోవచ్చు. అక్కడున్న నాలుగిళ్లవాళ్లు కలిసిపోయి, స్నేహం, ఆప్యాయత పంచుకుంటూ, తమ సమస్యల్ని, బాధల్ని ఇతరులతో చెప్పుకుంటూ కలిసి మెలిసి వుండేవాళ్లు.

ఇలా ఒడిదుడుకులు లేకుండా సాగిపోతున్న జీవితంలో అనుకోని మార్పు వచ్చింది.

లలితా వాళ్లకు ఇప్పుడు డబ్బు చాలా అవసరం. భార్యాభర్తలు కలిసి సంపాదించుకుంటే కాని గడవని పరిస్థితులు. అదీకాక తనకు అన్నీ అర్హతలుండీ అంత మంచి ఉద్యోగం వదులుకోడమూ మూర్ఖత్వమే. అందుకే సందేహిస్తూ అయినా ఈ కాలనీకి మారిపోయారు.

కాని లలితకు, వచ్చిన కొద్దిరోజులలోనే ఈ కాలనీలో మంచి గుర్తింపు రావడంతో ఆమె భయాలన్నీ అర్ధరహితమనిపించింది. లలిత పేరు, ప్రతిష్టలు కాన్వెంటు పిల్లలద్వారా కాలనీ అంతా వ్యాపించాయి. 'లలితా టీచరు చాలా మంచిది. ఎంత బాగా మాట్లాడుతుందో, పాఠాలు ఎంత బాగా చెపుతుందో, ఎవరినీ కొట్టదు! పాటలు ఎంత బాగా పాడుతుందో' ఇలా కాన్వెంటు నుంచి పిల్లలు ఇంటికి వచ్చి లలితా సహస్రం వల్లిస్తుంటే అందరికీ లలితాటీచర్‌ని చూడాలన్న ఆరాటం ఎక్కువైంది. ఆ అవకాశం త్వరలోనే పేరెంట్స్‌డేలో వచ్చింది. ఆ రోజున లలిత ప్రార్థన ఎంతో శ్రావ్యంగా పాడింది. అది కేవలం గాలిపాటకాదని ఆమెకు సంగీతంలో మంచి ప్రావీణ్యం వుందనీ తెలిసింది. విద్య, దాని అవసరం, బోధనలో మానవత్వపు విలువల అవసరం, క్రమశిక్షణా మొదలైన అంశాలమీద చక్కటి ఇంగ్లీషులో అనర్గళంగా ఉపన్యసించి, అందరినీ ముగ్ధులను చేసింది. ప్రిన్సిపల్, ముఖ్య అతిథి అందరూ లలితను ప్రశంసించడంతోటే వాళ్ల ప్రసంగాలు నింపేశారు. ఒకలా అది లలితా అభినందన సభలా తయారైంది. ఆనాడు తనకు లభించిన గౌరవాలకి, గుర్తింపుకీ లలిత సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది. జీవిత వైకుంఠపాళిలో ఓ పెద్ద నిచ్చెన ఎక్కింది!

ఇక్కడినుంచి, లలితకు లేడీస్ క్లబ్‌నుండి ఆహ్వానాలు రావడంలో ఆశ్చర్యం లేదు. లేడీస్ క్లబ్‌కి ఎవరినో పెద్దవాళ్లను పిలుస్తుంటారు. అలాంటి ప్రముఖులు వచ్చినప్పుడు కార్యక్రమం హుందాగా నడిపించాలి. నాలుగు ముక్కలు చెప్పగలగాలి. ఆ విషయ పరిజ్ఞానం వుండాలి. వీటికితోడు అందం, ఆకర్షణవుంటే మరీమంచిది. అన్ని లక్షణాలూ లలితలో మూర్తీభవించి వున్నాయి.

లలితకు క్లబ్‌నుండి ఆహ్వానాలు అందుతున్నాయి. లలిత సభలలో ప్రార్థన పాడడంతో మొదలుపెట్టి, సభా ప్రారంభం చేయడం, ముఖ్య అతిథుల్ని పరిచయం చేయడంలాంటి అన్ని కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహిస్తోంది. పచ్చని శరీరం మీద ఒంటిపేట గొలుసు పది ఆభరణాల పెట్టుగా మెరుస్తుంటే, కట్టిన చీర ఆమె అందాల్ని, పొందికగా నాజూగ్గా చుట్టుకుని ఆమె వయ్యారానికి మరింత మెరుగుపెడుతుంటే, చలాకీగా, మెరుపుతీగలా తిరిగే లలిత లేడీస్ క్లబ్‌లో సామాన్య దృశ్యమైపోయింది.

తలవని తలంపుగా తనకు లభించిన ఈ సావకాశాలకి లలిత మురిసిపోయింది. ఇన్నాళ్లు తనలో అప్రకటితంగా వున్న ప్రతిభకి ఇక్కడ వికసించే అవకాశం లభించింది. లలిత భర్తకూడా ఆమెకు లభించిన కీర్తి ప్రతిష్ఠలకి ఎంతో సంతోషించాడు. నిజం ఆలోచిస్తే, లలిత అంతస్తు వీళ్లందరి ముందు ఏపాటిది? ఈమె ఈ ధనిక సమాజంలో తనకంటూ ఓ విశిష్టస్థానం సంపాదించడం చాలా ఆనందకరమైన విష

యం. కానీ! అతని మనసులో ఏవో శంకలు. అది గమనించిన లలిత ఓ రోజు భర్తని అడిగింది.

"ఈ కొత్త పరిసరాల్లో నేను ఇంతమంది అభిమానం చూరగొన్నందుకు మీరు మనస్ఫూర్తిగా సంతోషిస్తున్నారని నాకు తెలుసు. కాని, మీ ఉత్సాహాన్ని, సంతోషాన్ని పూర్తిగా వ్యక్తం చేయలేకపోతున్నారు. ఏవో నీలినీడలు మిమ్మల్ని కలవరపెడుతున్నాయి. అది ఎందుకో చెప్పరూ?"

విశ్వం నిట్టూర్చి అన్నాడు "ఇక్కడకు వస్తుంటే ఇక్కడ మనల్ని పలకరించేవాళ్లొక్కరైనా వుంటారా అని అనుమానించాను. ఈ ధనికుల మనస్తత్వం వింతగా వుంటుంది. వాళ్లు వారి సాటివారితోనే మెలుగుతారు. అలాంటిది విన్ను ఒక్కసారిగా నిర్ద్వందంగా వారి సమాజంలో కలిపేసుకున్నారు. ఇది వాళ్లు నీ, నా ఆర్థిక స్థితిగతులు తెలిసే చేశారా అని నా అనుమానం!"

విశ్వం భయాలకి లలిత నవ్వుకుంది.

"ఏమండీ, వాళ్లు నా ఆస్తి చూసికాదండి నాకు ప్రాధాన్యం ఇచ్చింది. నాకున్న ప్రతిభకి. వాళ్లకు లేని ఆస్తి భగవంతుడు నాకు ప్రసాదించాడు. దానికే నాకీ గౌరవం"

కానీ విశ్వానికి నమ్మకంలేదు. మనిషిలో ప్రతిభను గౌరవించినా, మనిషిని గౌరవించాలంటే అతనికి ధనం వుండాలి. అన్ని ఇంద్రియాలు పనిచేయాలంటే వెనుక ప్రాణంలేక ఆత్మ ఎలా వుండాలో, మన ప్రతిభనీ, నైపుణ్యాన్నికూడా భాసింపజేసేది వెనుకనున్న ధనమే! కానీ విశ్వం ఇంత చేదు నిజం ఇప్పుడే ఆమె గొంతులో పోసి, ఆమె ఉత్సాహాన్ని హత్యచేయదలచుకోలేదు. కాని కొంచెం హెచ్చరికగా అన్నాడు. "కాని పరిస్థితులు వక్రిస్తే ఆ మార్పునుకూడా భరించగలిగే ధైర్యాన్ని అలవరచుకో"

అతని పిచ్చిభయాలకు లలిత నవ్వుకుంది!

లలిత ఈ ధనిక సమాజం మధ్యకు తటిల్లతలా దూసుకువచ్చింది. ఆ వేగానికి,

## పులి అభిమానం



జిమ్ కోర్ బెట్ ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేంగాడు. ఆయన ఆడపుల్నీ, క్రూర మృగాల్నీ ఎంతగానో స్టడీ చేశాడు. ఆయన అనుభవంలో పులులు చంటిపిల్లలకు ఎలాంటి కీడు చేయవు. ఈ మధ్యన జగధవ్‌పూర్‌కు సమీపంలోని ఓ అడవిలో మూడు సంవత్సరాల జయరామ్‌ను ఓ పులి ఎత్తుకుపోయింది. వెంటనే అతడి తండ్రి ముకురామ్ కంగారుగా గొడ్డలితో అడవిలోకి వెళ్లాడు! అయితే చెట్టుకింద హాయిగా నిద్రపోతున్న జయరామ్‌ను చూసి ఎంతో సంతోషించాడు ముకురామ్! ఆ పసిబాలుడి చేతికి పులి ఎత్తుకోవడంవలన ఓ చిన్న గాయంతప్ప మరో గాయంలేకపోవడం విశేషమే! అంటే ఆ బాలుడితో పులి కాసేపు ఆడుకుని వుంటుందన్నమాట! ఏది ఏమైనా జిమ్‌కోర్‌బెట్ అన్నట్లు పిల్లల్ని పులులు ఏమీ చేయవేమో!

— జూపిటర్

కాంతికి వాళ్లు ముగ్ధులైపోయారు. అదీకాక క్లబ్ కార్యక్రమాలలో లలిత ఓ పెన్నిధిలా దొరికింది. ఎంత ప్రముఖులు సభకు వచ్చినా లలిత ఆధ్వర్యంలో సభ జయప్రదంగాసాగుతుందన్న విశ్వాసం ఏర్పడింది. ఆమె వాళ్లకు చాలా అవసరం కనుక వెంటనే ఆమె ప్రతిభ గుర్తించి పట్టం కట్టారు. ఈ తొందరలో. కొత్త పరిచయంలో వాళ్లు లలిత అంతస్థును గురించి పట్టించుకోలేదు. తాత్కాలికంగా ఆ విషయం మరుగునపడింది. అదీగాక లలిత వాజూకుదనం, సంస్కారం అన్నీ చూపి ఆమె తప్పక పెద్ద కుటుంబానికి చెందినదే అని ఓ అభిప్రాయంకూడా వాళ్లకి కలిగింది. లలిత తండ్రి ఓ ప్రతిష్టాకరమైన గవర్నమెంట్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆమె భాగ్యవంతుల పిల్ల అనే అందరి విశ్వాసం.

కాని నలుగురి మధ్య వుంటుంటే నిజస్థితి ఎప్పుడో బయటపడక తప్పదు. పైగా లలిత తన ఆర్థిక పరిస్థితిని దాచిపెట్టి ఇతరులను తనొక కలవారి ఆడపడుచులా మభ్యపెట్టే మనిషి కాదు. అందువలన నెమ్మదిగా లలిత పరిస్థితుల గురించి మరికొద్దిరోజులలో అందరికీ సమాచారమందింది.

లలితకు టి.వి, ఫ్రిడ్జిలాంటి సదుపాయాలుకూడా లేవు. వాళ్ల ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా వుంది. అంటే ఇంకా అప్పులూ, బాధ్యతలతో సతమతమౌతున్నారు. వేన్నీళ్లకు చన్నీళ్లన్నట్టు ఇక్కడ కాన్వెంట్లో వచ్చే డబ్బులకోసం ఇక్కడకు వచ్చిచేరారు. అదృష్టంకొద్దీ ఎవరో తక్కువ అద్దెకు ఓ పోర్షన్ ఇచ్చారుకనుకగాని లేకపోతే దూరంగా ఏదో పెంకుటింట్లో వుండవలసింది. కొన్నాళ్లవరకు పొదుపుగా గడుపుకుంటే ఆ తర్వాత తమకు కావలసినవి సమకూర్చుకోవచ్చు.

ఇదంతా విన్నవాళ్లు లలిత విషయంలో ఏదో మోసపోయామన్నట్టు బాధపడ్డారు. ఆమె స్థితిగతులు తెలియకుండా నెత్తిన ఎక్కించుకుని తమతో సమంగా తిప్పుకున్నారు. సభకు కార్లలో తీసుకువచ్చారు. దండలు వేశారు. వేదికమీద ప్రశంసల వర్షం కురిపించారు. 'లలితగారూ' అంటూ ఆమెను గౌరవించారు. కాని ఇప్పుడు లలిత సామాన్య కుటుంబీకురాలు. ఇంకా మాట్లాడితే వెలకు మరో నాలుగు వందలిస్తానంటే ఇంటికి వచ్చి పిల్లలకు పాఠాలుకూడా చెబుతుంది. అంత మాత్రాన లలితకున్న ప్రతిభను ఎవరూ కాదనడంలేదు. ఆమెతో మసులుకునే విధానంగురించే బాధపడివది. తనను గురించిన వివరాలు అందరికీ తెలిశాయని, అందరూ తనయెడ సానుభూతికూడా చూపిస్తున్నారని లలితకు తెలిసింది.

క్రమేణా లలితయెడల వారి ప్రవర్తన మారింది. 'లలితగారు' అన్న గౌరవపదం కత్తిరించి 'లలితా' అని పిలుస్తున్నారు. లలితను ఓ పనిమనిషిలా దూరంగానే వుంచుకున్నారు. లలిత మనసు బాధపడింది. ఆమె హృదయం గాయపడింది. అయినా ఓర్పుతో భరించింది. కాని ఆ కాస్త ఓర్పుకూడా వశించే పరిస్థితులు దాపురించాయి.

ఇంతవరకు తనను సెక్రటరీ అన్నా, వర్కర్ అన్నా, ఏమన్నా కొందరైనా పరిచ

యస్తులు స్నేహంగా, చనువుగా పలకరిస్తు న్నారు. కొన్నాళ్లుగా లలితను దూరంపేశారు . ఆమె స్థానం ఆమెకు తెలియాలి అన్నట్టు గా మారింది వాతావరణం. జడ్జిగారి పెళ్లాం ఎదురుగా ఠీవిగా కుర్చీలో కూర్చోకూడదు. ఎస్.పి.గారి భార్య వస్తుంటే దారికి అడ్డం తప్పుకుని వినయంగా నమస్కరించాలి. ఎవ రైనా పెద్దవాళ్లు వస్తే 'లలితా, చూస్తేవే అలా ఆవిడకు ఆ కుర్చీ వెయ్యి' అంటే వేయాలి. అంతవరకే ఆమె అవసరం. ఆ తర్వాత ఆమె దూరంగా వెళ్లిపోవాలి. వాళ్లతో వాళ్లు గ్రూపులుగా చేరి కబుర్లు చెప్పుకుంటారు. లలిత ఆ కులంలో ఆ ధనకులంలో అంటరానిది.

కంట్రాక్టర్ రంగారావుగారింట్లో వివా హం. లలిత ఉన్న వీధిలోనే. సాయంత్రం డిన్నరు. కాలనీలో వాళ్లు కార్లలో కొందరు, నడుచుకుంటూ కొందరూ వెళుతున్నారు. చాలామంది లలిత ఇంటిముందర నించే వెళ్తూకూడా తల ఇటు తిప్పడంలేదు. ఈమెనెక్కడ పిలవాలో అన్నట్టు. లలిత ఇంటిలోపల నిలబడి కిటికీలోంచి చూస్తోంది . అసలు ఆమెకు ఆహ్వానమే రాలేదు. తన స్థితి ఎంతకు దిగజారిందో లలితకు అర్థమైం ది. ఈ జీవన వైకుంఠపాళిలో ఆమెను ఇప్పుడు 'పేదరికం' అనే పెద్ద పాము మింగేసింది. ఇక మొదటివరసలో చిన్నపా మునుకూడా దాటలేదు. చీకటి పడ్డాక భర్త వచ్చాడు. లలిత అతని ఒడిలో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. దూరంనుంచి సన్నాయి వినిపిస్తోంది. రంగుల దీపాలు కనిపిస్తున్నాయి. విశ్వం భార్య తల నిమురు తూ అన్నాడు. "నాకు తెలుసు లలితా ఇలా జరుగుతుందని. మనం మన పేటలోకి వెళ్లిపోదాం. పదిమంది పిల్లలకు పాఠాలు చెబితే ఈ మాత్రం సంపాదన రాకపోదు" అని ఓదార్చాడు.

లలిత ఆ రాత్రే కాన్వెంట్ ఉద్యోగానికి రాజీనామా పత్రం రాసింది.

●

